క్లుప్తంగా

గోల్డ్‌మెడల్స్ సాధించిన లెక్చరర్‌కు అభినందన



ఉమాకుమారిని అభినందిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, అధ్యాపకులు

నర్సీపట్నం : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీలో ఎం.ఎల్.ఐ ఎస్సీ 2023–24 ఫలితాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న కె.ఉమా కుమారి ఉమెన్ క్యాటగిరిలో హైయెస్ట్ అగ్రిగేట్ మార్క్స్ సాధించారు. ఇందుకు ఆమెకు రెండు గోల్డ్‌మెడల్స్ సాధించారు. సెప్టెంబర్ 30న జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, అంబేడ్కర్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ గంటా చక్రపాణి, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్, ఉమా కాంజీలాల్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, సహ అధ్యాపక బృందం ఆమెను ఘనంగా సత్కరించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయులు

మాకవరపాలెం: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయిలో జుత్తాడ హైస్కూల్లో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీలకు ఉన్నత పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఏడుగురు విద్యార్థులు తమ ప్రతిభను చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం నారాయణరావు బుధవారం తెలిపారు. ఈ విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు డి.రవి, చంద్రదేవితోపాటు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



జీఎస్టీపై విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ నాగమణి

కె.కోటపాడు: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గనున్నట్టు కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగమణి అన్నారు. కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సూపర్ జీఎస్టీ 2.0లో బాగంగా బుధవారం కళాశాల విద్యార్థులకు మానవ వనరుల అభివృద్ధి–డిజిటల్ సాధికారితపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో దాసరి మణి, ఆరిపాక చంద్రిక, గండేపల్లి జ్యోత్స్న విజేతలుగా నిలిచారు.

బెల్ట్‌షాపుల్లో అక్రమంగా మద్యం అమ్మకాలు

కె.కోటపాడు : గ్రామాల్లో అక్రమ మద్యం బెల్ట్ షాపుల ద్వారా అమ్మకాలు జరుగుతున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న, మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు ఆరోపించారు. కె.కోటపాడులో బుధవారం వీరు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం వ్యాపారం చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టనట్లు చూస్తున్నారని వీరు అన్నారు. బెల్ట్‌షాపుల్లో మద్యం సీసాల ధరలపై అదనంగా డబ్బులు వేసుకుంటూ అమ్మకాలు చేస్తున్నారని వెంకన్న అన్నారు. వీరిపై చర్యలను తీసుకోవాలని ఆయన కోరారు.

యువత చెడు వ్యసనాలను విడనాడాలి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎస్ఐ తారకేశ్వరరావు

నాతవరం: యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారితే విలువైన జీవితాలను చేతులారా నాశనం చేసుకున్నట్టే అని నాతవరం ఎస్ఐ వై. తారకేశ్వరరావు అన్నారు. మండలంలో మాధవగరం పంచాయతీలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఆట వస్తువులు గ్రామ పెద్దల సమక్షంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నాతవరం మాధవనగరం పంచాయతీలో నల్లకొండమ్మ తల్లి పండగను ఇచ్చిన మాట ప్రకారం కోడి పందాలు, పేకాటలు, అసాంఘిక కార్యక్రమాలు లేకుండా గ్రామపెద్దలు ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరుపుకొన్నారన్నారు. గ్రామంలో డ్యాన్స్ బేబీ కార్యక్రమానికి ఖర్చు చేసే కొంత మొత్తంలో విద్యార్థులకు కావలసిన పుస్తకాలు, ఆట వస్తువులు కొనుగోలు చేశారన్నారు. వాటిని గ్రామపెద్దల సమక్షంలో విద్యార్థులకు అందజేశామని తెలిపారు.

రోడ్డు ఇలా... రాకపోకలు ఎలా...!



- కోతకు గురైన మట్టిరోడ్డు
- నెల రోజులు దాటినా పట్టించుకోని అధికారులు
- బీటీ రోడ్డు, కల్వర్టు పనుల్లోనూ నిర్లక్ష్యం
- బోడిగరువు, నేరెళ్లపూడి గిరిజనులు నరకయాతన

దేవరాపల్లి: గిరిజనుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా ప్రదర్శిస్తుంది. చింతలపూడి పంచాయితీ శివారు బోడిగరువు, నేరెళ్లపూడి కోతకు గురైన రోడ్డు సమస్యను పట్టించుకోకపోవడమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. సమ్మెద నుంచి బోడిగరువు, నేరెళ్లపూడి గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. మట్టి రోడ్డు కోతకు గురై సుమారు నెల రోజులు దాటిపోతున్నా ఇటు అధికారులు, అటు కూటమి ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. దీంతో ఆయా గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యవసర సరుకులు, ఇతర సామాగ్రిని తెచ్చుకోవాలన్నా ఈ మార్గం గుండానే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన మట్టి రోడ్డు కోతకు గురైన పట్టించుకోక పోవడంపై స్థానిక గిరిజనులు తీవ్రంగా మండిపడుతున్నారు.



రోడ్డు కోతకు గురికావడంతో శారదానది ఒడ్డు నుంచి కాలినడకన రాకపోకలు సాగిస్తున్న గిరిజనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణం....

దట్టమైన అటవీ ప్రాంతం మధ్య ఉన్న ఈ రెండు గ్రామాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు సుమారు రూ. 2 కోట్లతో నూతనంగా మట్టిరోడ్డును నిర్మించారు. గ్రామానికి కనీసం కాలిబాట సైతం లేక స్థానిక గిరిజనులు దశాబ్దాలుగా ఇబ్బందులను తెలుసుకునేందుకు డిప్యూటీ సీఎం హోదాలో ముత్యాలనాయుడు సుమారు 5 కి.మీ మేర కొండలు, గెడ్డలు దాటుకుంటూ కాలినడకన బోడిగరువు, నేరెళ్లపూడి గ్రామాలకు వెళ్లి వారి కష్టాలు తెలుసుకున్నారు. తక్షణమే మట్టి రోడ్డుకు రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేసి, నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదకన చేపట్టేలా చొరవ చూపారు. ఈ మార్గంలో బీటీ రోడ్డు నిర్మాణానికి సైతం నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో బీటీ రోడ్డుతో పాటు కొన్ని చోట్ల కల్వర్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణంపై తీవ్ర నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించింది. బీటీ రోడ్డు, కల్వర్టుల నిర్మాణం పేరిట స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కుమారుడు బండారు అప్పలనాయుడు అనధికారికంగా ఈ ఏడాది మార్చి 11న శంకుస్థాపన చేసి హడావిడి చేశారు. పనులు చేపట్టడంతో మాత్రం చిత్తశుద్ధి కనబరచలేదు. ఇప్పటికైనా కూటమి ప్రజాప్రతినిధులు స్పందించి కోతకు గురైన రోడ్డును మట్టితో పూడ్చి తిరిగి రాకపోకలను పునరుద్ధరించాలని స్థానిక గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

నిర్లక్ష్యం తగదు



సమ్మెద నుంచి తమ గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. అప్పటి నుంచి బోడిగరువు, నేరెళ్లపూడి నుంచి సమ్మెదకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రమాదం అని తెలిసినా గత్యంతరం లేని పరిస్థితులలో శారదానది దాటి రాకపోకలు సాగించాల్సి వస్తుంది. మట్టి రోడ్డు కోతకు గురై నెల రోజులు దాటి పోయినా అధికారులు పట్టించుకోక పోవడం దారుణం.

– పోయిరి రాము, బోడిగరువు

తక్షణమే రోడ్డు బాగు చేయాలి



మా పంచాయతీ పరిధిలోని బోడిగరువు, నేరెళ్లపూడి గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాల ధాటికి కోతకు గురైన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కోతకు గురైన రోడ్డును పూడ్చక పోవడంతో స్థానిక గిరిజనులు ప్రత్యామ్నాయ దారుల్లో రాకపోకలు సాగిస్తూ నానా అవస్థలు పడుతున్నారు. గిరిజనులు పడుతున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే కోతకు గురైన రోడ్డును మట్టితో పూడ్చాలి.

– దొమ్మంగి బోడెమ్మ, సర్పంచ్ చింతలపూడి

జననేత కోసం స్వాగత ఫ్లెక్సీలు



రోడ్డు పక్కన నాయకులు ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలు

మాకవరపాలెం: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలు భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేశారు. ఈ మేరకు బుధవారం మెడికల్ కాలేజీ ప్రాంతం నుంచి మండల సరిహద్దు గ్రామమైన వెంకన్నపాలెం వరకు భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి పక్కగా అడుగడుగునా ఫ్లెక్సీలు కట్టారు. ఫ్లెక్సీలు కడుతుండగా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ రంగంలోకి దిగారు. ఫ్లెక్సీలు కట్టించారు. కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, నియోజకవర్గ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు బొడ్డు గోవిందరావు, నేతలు వాసు, భద్రాచలం పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వద్దు

నాతవరం: గ్రామాల్లో వీధుల్లో ఆరుబయట చెత్త వేయరాదని నాతవరం ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో గల హైస్కూల్ వీధుల్లో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రతి పంచాయతీలో ఇంటింటికీ డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశామన్నారు. వీధులు డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేషుకుమార్, నాతవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కూండ్రపు సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



డీఈఓ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న మోహిత

మాడుగుల రూరల్: జీఎస్టీ 2.0 అన్న అంశం మీద కశింకోట హైస్కూలులో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలల్లో కె.జె.పురం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థిని ప్రథమ బహుమతి పొందింది. అన్ని హైస్కూళ్ల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో పదో తరగతి విద్యార్థిని కాళ్ల మోహిత జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. మోహితకు జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు, చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రంను అందజేశారు. హెచ్ఎం శ్రీనివాసశర్మ, పాఠశాల కమిటీ చైర్మన్ కర్రి సంతోష్, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు బహుమతి పొందిన విద్యార్థినిని అభినందించారు.

'జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు'



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న, మండల కార్యదర్శి నరసింహమూర్తి

మాడుగుల రూరల్: రావికమతం మండలం కొమిరి గ్రామాల్లో 6 వ విడత భూ పంపిణీలో ఉరలోవ కొండకు చుట్టు 450 మందికి పట్టాలు ఇచ్చిన భూములకు సర్వే నంబర్లు సరి చేయడం కోసం గ్రామసభలు జరిపి వెంటనే వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి నరసింహ మూర్తి బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత నెల 27 వ తేదీన జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను నర్సీపట్నం ఆర్డీఓ, మాడుగుల తహసీల్దార్ పక్కన పెట్టారన్నారు. పట్టాలు ఇచ్చిన సర్వే నంబరుకు, పేదల సాగులో ఉన్న సర్వే నంబబర్లు గల భూములకు సంబంధం లేదన్నారు. దీనివల్ల పట్టాదారులంతా ఆందోళన చేందుతున్నారని పేర్కొన్నారు. వెంటనే గ్రామసభలు జరిపి జిల్లా కలెక్టర్ ఆదేశాలను అమలు చేయాలని, లేదంటే తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామన్నారు.

చెత్త కుప్పను గ్రామానికి దూరంగా తరలించాలి



రమణ

దేవరాపల్లి : దేవరాపల్లి పంచాయతీ పరిధి లో దేవరాపల్లి నుంచి వాలాబు వెళ్లే రహదారిలో తారు రోడ్డుకు ఆనుకొని డంపింగ్‌యార్డును తలపిస్తున్న భారీ చెత్త కుప్పను గ్రామానికి దూరంగా తరలించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ డిమాండ్ చేశారు. దేవరాపల్లిలో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ మార్గం గుండా నిత్యం రాకపోకలు సాగించే సుమారు 100 గ్రామాల ప్రజలు చెత్త కుప్ప నుంచి వెలువడే దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. హెల్త్‌సెంటర్‌కు సుమారు 50 అడుగుల దూరంలో ఉన్న చెత్తకుప్ప డంపింగ్ యార్డును తలపిస్తుండడంతో సమీప ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చెత్త శారదా నదిలో పడడంతో నీరు కలుషితమవుతుందన్నారు. ఇప్పటికైనా స్థానిక అధికారులు స్పందించి చెత్తకుప్పను తొలగించాలని లేకుంటే జిల్లా కలెక్టర్ సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత

నాతవరం : వన్యప్రాణులను రక్షించే బాధ్యత అందరిపై ఉందని నాతవరం మండల అటవీశాఖసెక్షన్ అధికారి చిరంజీవి అన్నారు. మండలంలో బుధవారం కృష్ణాపురం అగ్రహారం, కె.వి.శరభవరం గ్రామాల్లో అటవీశాఖ అధికారులు అడవులతో పాటు వన్యపాణులకు కాపాడాలంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ఈనెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు పలు గ్రామాల్లో వన్యప్రాణుల రక్షణపై అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవిలో సంచరించే వన్యప్రాణులకు వేటాడడం చటం టరిత్యానేరమన్నారు. వన్యప్రాణులతో పాటు అడవులను కాపాడేందుకు ప్రజాప్రతినిధులు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వెదురుపల్లి, పెడిమికొండ అటవీ బీట్ ఆఫీసర్లు నాగరాజు, మహంతి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ సెక్షన్ అధికారి చిరంజీవి

గోతులమయంగా రోడ్లు



సురవరం వద్ద ఆర్ అండ్ బీ రోడ్డు గోతులు పడిన దృశ్యం



ఎం. కోటపాడుకు, కేజేపురం జంక్షన్ మధ్యలో గోతులుపడిన ఆర్అండ్‌బీ తారు రోడ్డు

మాడుగుల : మండలంలో తాటిపర్తి నుంచి కేజేపురం జంక్షన్ వరకు ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారింది. దీంతో ఆటోలతో పాటు, బైక్ ప్రమాదాలు జరుగుతాయని, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. మాడుగుల మండలంతో పాటు అల్లూరి, నర్సీపట్నం నుండి చోడవరం, అనకాపల్లి వెళ్లాలంటే రోడ్డు గోతులమయంగా ఉండి ప్రయాణికులను నరకాన్ని తలపిస్తోంది. వర్షం కురిస్తే గోతుల్లో వరద నీరు చేరిపోయి తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోలేదని, వాహన చోదకులు ఆవేదన చెందుతున్నారు. రోడ్లు బాగోక పోవడంతో పల్లెవెలుగు బస్సులు కూడా పూర్తి స్థాయిలో మాడుగుల రావడం లేదని, ప్రయాణికులు చెబుతున్నారు.

బుద్ధిమాంద్యం గల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



దిబ్బిడి పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులు

బుచ్చెయ్యపేట : బుద్ధిమాంద్యం గల పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపి వారు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించేలా చేయూతనివ్వాలని ప్రత్యేక ఉపాధ్యాయుడు బి.అప్పలరాజు తెలిపారు. బుధవారం దిబ్బిడి హైస్కూల్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి డ్రూస్లెక్సియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లల్లో ఏడేళ్ల తరవాత బుద్ధిమాంద్యం లక్షణాలు కనిపిస్తాయన్నారు. బుద్ధిమాంద్యం ఉన్న పిల్లలను వేరుగా చూడకుండా వారు ఒక సమస్యగా కాకుండా వారి ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. సమ్మిళిత వాతావరణంలో పిల్లలు విద్య పొందేలా పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణ, స్కీనింగ్ పరీక్షలు ప్రారంభించారన్నారు. ఇలాంటి విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ఇంటి వద్ద ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాలలో వీరి కోసం ప్రత్యేక ఉపాధ్యాయులుతో ప్రత్యేక తర్ఫీదు అందిస్తున్నామన్నారు.

కార్యకర్తలు తరలిరావాలి

గొలుగొండ : మాకవరపాలెంలో ఉన్న మెడికల్ కళాశాలను పరిశీలించడానికి గురువారం వస్తున్న మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు మండలం నుంచి కార్యకర్తలు, నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీ సభ్యులు అంతా తరలి రావాలని జడ్పీటీసీ సుర్ల గిరిబాబు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొరుప్రోలు పాణీశాంతారామ్ పిలుపునిచ్చారు. పోలీసులు ఆంక్షలు విధించినా అభిమాన నాయకుడిని చూసేందుకు ప్రజలు కాలినడకన సైతం తరలిరావాలని కోరారు. ఉదయం మాకవరపాలెం చేరుకోవాలని కోరారు.

సందడిగా జాతీయ బాలికా దినోత్సవం

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్లో సబ్బవరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయం–1, 2 ప్రాంతాల్లో ఈ వేడుకలను జరిపారు. పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పలు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాల హెచ్ఎం ఎస్.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణి, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ కిశోర బాలికా దినోత్సవం

పరవాడ: జాతీయ కిశోర బాలికల దినోత్సవంలో భాగంగా నాయుడుపాలెం సచివాలయం పరిధి మెట్టపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు బుధవారం ఆటల పోటీలు, సైబర్ నేరాలు, రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. విజేతలకు ఈ నెల 12న బహుమతులు అందించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణి తెలిపారు. కార్యక్రమంలో నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్లో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వసతి గృహం.. సమస్యలతో సతమతం



వసతి గృహం వద్ద నిల్వ ఉండిపోతున్న వర్షంనీరు



వస్త్రాలు ఆరేయడానికి ఉపయోగపడుతున్న సోలార్ విద్యుత్ పలకలు



కశింకోట బీసీ బాలుర వసతి గృహం భవనం

- ఇబ్బందులకు గురవుతున్న బీసీ హాస్టల్ విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

కశింకోట: కనీస సౌకర్యాలు కరవై స్థానిక బీసీ బాలుర సంక్షేమ వసతి గృహం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురుతున్నారు. ప్రహరీ లేక రక్షణ కరవైంది. బెడ్లు లేక కటిక నేల మీదే నిద్రిస్తున్నారు. ప్రాంగణంలో వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో అవస్థలు పడుతున్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గల బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 52 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరు స్థానిక డీపీన్ జెడ్పీ హైస్కూల్‌లో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్నారు. గతంలో 80 వరకు విద్యార్థులు ఉండేవారు. సమస్యలు తిష్టవేయడంతో హాస్టల్‌లో చేరేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు.

నిత్యం పశువులు, పందుల సంచారం

ప్రహరీ లేకపోవడంతో పశువులు, పందులు హాస్టల్ ప్రాంగణంలో సంచరిస్తున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలుతాయని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

- 14 మరుగుదొడ్లకు గాను ప్రస్తుతం పది వినియోగంలో ఉన్నాయి. సురక్షిత తాగునీటి సదుపాయం లేదు. బోరు నీటినే మరిగించి ఇస్తున్నారు. ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

- వసతి గృహం ఆవరణ పల్లంగా ఉండడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో దోమలు వృద్ధి చెందున్నాయి. వాటి వల్ల విద్యార్థులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది.
- బెడ్‌లు లేకపోవడంతో కటిక నేల మీదే విద్యార్థులు నిద్రించాల్సి వస్తోంది. జిల్లాలోని వివిధ వసతి గృహాల్లో అదనంగా మిగిలిపోయిన బెడ్లు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని ఇక్కడకు తరలించి ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని విద్యార్థులు తల్లిదండ్రులు చెబుతున్నారు.
- దుప్పట్లు ఇవ్వకపోవడంతో తమ ఇళ్ల నుంచి తెచ్చుకున్న వాటిని విద్యార్థులు వినియోగిస్తున్నారు. రానున్నది చలి కాలం కావడంతో చలిని తట్టుకోవడానికి అనువైన దుప్పట్లను ప్రభుత్వం అందించాల్సి ఉంది.
- ఇక వసతి గృహానికి అన్ని వేళల విద్యుత్ సదుపాయం కోసం సోలార్ దీపాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి కోసం అమర్చిన పలకలు చాలా కాలంగా పనిచేయడం లేదు.
- బాత్‌రూమ్‌లు లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయట స్నానం చేయాల్సివస్తోంది. ప్రస్తుతం వసతి గృహానికి ఇన్‌చార్జి సంక్షేమ అధికారి ఉన్నాయి. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షణ చేయడానికి రెగ్యులర్ అధికారిని నియమించాల్సి ఉంది. వసతి గృహంలో సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు,వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మాణానికి చర్యలు

బాలుర బీసీ వసతి గృహానికి ప్రహరీ నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటీవల ఇంజినీరింగ్ సిబ్బంది వచ్చి కొలతలు తీసి, పరిశీలించి వెళ్లారు. తాజాగా రగ్గులను అందించాం. ప్రస్తుతం విద్యుత్ సమస్య లేదు. బెడ్‌లను సమకూర్చాల్సి ఉంది.

–జె.నారాయణరావు, ఇన్‌చార్జి బీసీ బాలుర వసతి గృహం సంక్షేమ అధికారి, కశింకోట.

'జీఎస్టీ ప్రయోజనాలు ప్రతి ఒక్కరికీ తెలియాలి'

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ 2.0 ప్రయోజనాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించేందుకు విద్యార్థులు కృషి చేయాలని పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌బాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సూపర్ జీఎస్టీ 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. జీఎస్టీ అమలు తీరుతెన్నులను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు లక్ష్మి, కుమారి, కల్యాణి, సత్యనారాయణ, ఉషా కుమారి, లక్ష్మీకాంతం, శేఖర్‌బాబు, పద్మ, దివ్య, ఈశ్వరరావు పాల్గొన్నారు.

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు

పెందుర్తి: చాతుర్మాస్య దీక్షలో భాగంగా స్థానిక వేంకటాద్రిపై బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా స్వామివారికి గోత్రనామార్చనలు నిర్వహించారు.